సాక్షి
ఆదిలాబాద్

ఇక సెలవు..



మాజీ ఎంపీ రాథోడ్ రమేశ్ అంతిమ యాత్రకు అభిమానులు, కార్యకర్తలు భారీగా తరలివచ్చారు. అభిమాన నేతను కడసారి చూసి కన్నీటి వీడ్కోలు పలికారు. పార్టీలకతీతంగా ప్రజాప్రతినిధులు హాజరై నివాళులర్పించారు.

- 8లో▸

సోమవారం । 1 । జూలై । 2024

న్యూస్‌రీల్

నేటి ప్రజావాణి రద్దు

కైలాస్‌నగర్: ప్రతి సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని ఈ వారం రద్దు చేసినట్లు కలెక్టర్ రాజర్షి షా ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర పంచాయతీరాజ్, మహిళాభివృద్ధి, శిశు సంక్షేమశాఖ మంత్రి సీతక్క జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించనున్నందున గ్రీవెన్స్‌ను రద్దు చేసినట్లుగా పేర్కొన్నారు. వచ్చే వారం యథావిధిగా కొనసాగుతుందని తెలిపారు. జిల్లా ప్రజలు విషయం గమనించాలని ఆయన కోరారు.

జిల్లాలో నేడు మంత్రి సీతక్క పర్యటన

కైలాస్‌నగర్: రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క సోమవారం జిల్లాలో పర్యటించనున్నారు. ఆదివారం రాత్రి ఉట్నూర్‌కు చేరుకుని కేబీ కాంప్లెక్స్‌లో బస చేయనున్నారు. ఉదయం 9గంటలకు పీఎంఆర్‌సీ భవనం నుంచి బయలుదేరి ఉట్నూర్ మండలంలోని రామలింగంపేట నుంచి శ్యాంనాయక్ తండా వరకు కొత్తగా నిర్మించిన బీటీ రోడ్డును ప్రారంభిస్తారు. 10.30గంటలకు మావల అర్బన్ పార్కుకు చేరుకుంటారు. అక్కడ నిర్వహించే వన మహోత్సవంలో పాల్గొని అధికారులు, ప్రజాప్రజానిధులతో కలిసి మొక్కలు నాటుతారు. అక్కడి నుంచి కలెక్టరేట్‌కు చేరుకుని దివ్యాంగులకు మోటార్ బైక్‌లు, వీల్ చైర్లను పంపిణీ చేస్తారు. 11.30 నుంచి మధ్యాహ్నం 1.30గంటల వరకు జిల్లా స్థాయి అధికారులతో సమీక్ష నిర్వహించనున్నారు. రెండు గంటలకు తిరిగి హైదరాబాద్‌కు బయలుదేరి వెళ్లనున్నారు.

డీఏవో గ్రేడ్-2 పరీక్షలు షురూ



అభ్యర్థిని తనిఖీ చేస్తున్న భద్రత సిబ్బంది

కైలాస్‌నగర్: టీజీపీఎస్సీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న డివిజనల్ అకౌంట్స్ ఆఫీసర్స్ (వర్క్స్) గ్రేడ్- 2 ఆన్‌లైన్ పరీక్షలు ఆదివారం ప్రారంభమయ్యాయి. స్థానిక నలంద డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో పరీక్ష కేంద్రం ఏర్పాటు చేశారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12.30గంటల వరకు నిర్వహించిన పరీక్షకు వంద మందికి గాను 63 మంది హాజరయ్యారు. అలాగే మధ్యాహ్నం 2.30నుంచి సాయంత్రం 5గంటల వరకు నిర్వహించిన పరీక్షకు గాను 60 మంది హాజరయ్యారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా కేంద్రంవద్ద గట్టి బందోబస్తుఏర్పాటు చేశారు.

ముస్కాన్‌కు వేళాయె

- బాల కార్మికుల విముక్తి కోసం 'ఆపరేషన్ ముస్కాన్'
- ఈనెల 31 వరకు కార్యక్రమాలు
- ప్రత్యేక బృందాల ఏర్పాటు

జిల్లాలో విముక్తి కలిగించిన చిన్నారుల వివరాలు..

సంవత్సరం	ఆపరేషన్ స్మైల్ ద్వారా	ఆపరేషన్ ముస్కాన్ ద్వారా
2017	144	147
2018	149	163
2019	62	311
2020	--	--
2021	113	72
2022	55	41
2023	110	135
2024	65	--

తనిఖీలు నిర్వహిస్తున్న బృందం సభ్యులు (ఫైల్)



ఆదిలాబాద్‌టౌన్: బాల్యం బంధీ అవుతుంది. విద్యతో బంగారు భవితకు బాటలు వేసుకోవాల్సిన చిన్నారులు బడిబయట దర్శనమిస్తున్నారు. ఇందులో వీధుల్లో భిక్షాటన చేసేవారు కొందరైతే, కార్ఖానాల్లో వెట్టిచాకిరీలో మగ్గుతున్న వారు మరికొందరు.వీరికి విముక్తి కల్పించేందుకు ప్రభుత్వం ఏటా ఆపరేషన్ ముస్కాన్, ఆపరేషన్ స్మైల్ వంటి కార్యక్రమాలను ఏడాదికి రెండుసార్లు నిర్వహిస్తున్నా పూర్తిస్థాయిలో సత్ఫలితాలు ఇవ్వడం లేదనే విమర్శలున్నాయి. జనవరిలో ఆపరేషన్ స్మైల్, జూలైలో ముస్కాన్ కార్యక్రమాలకు శ్రీకారం చుడుతున్నారు. తప్పిపోయిన పిల్ల ల ను తల్లిదండ్రులకు చేర్చి వారి కుటుంబాల్లో సంతో షం నింపడంతో పాటు యాచకులు, బాల కార్మికులుగా ఉన్నవారిని ఆ పనుల నుంచి విముక్తి చేసి విద్యాభ్యాసం చేసేలా చర్యలు చేపట్టడం ఈ కార్యక్రమాల ఉద్దేశం. ఈనెల 1నుంచి 31వరకు జిల్లాలో ఆపరేషన్ ముస్కాన్ నిర్వహించనున్నారు. ఇందుకోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేస్తున్నారు. పోలీసుశాఖతో పాటు బాలల సంరక్షణ సమితి, కార్మిక శాఖ సమన్వయంతో నెల పాటు జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో తనిఖీలు చేపడతారు. గుర్తించిన పిల్లలను సీడబ్ల్యూసీ ముందుంచి వారి తల్లిదండ్రులకు అప్పగిస్తారు.

వెట్టిచాకిరీ నుంచి విముక్తి..

బాల్యం ఇటుకబట్టీలు, హోటళ్లు, చెత్తకుప్పలు, మురికి కూపాల్లో బంధీ అవుతోంది. మురుగుకాల్వల నుంచి చెత్తడబ్బాలు, ఇతర వస్తువులను సేకరిస్తూ వాటి ద్వారా వచ్చే డబ్బుతో జీవనం సాగిస్తున్నారు. కొంత మంది తల్లిదండ్రుల ఆర్థిక పరిస్థితులు సరిగా లేకపోవడంతో పిల్లలను పనులకు పంపుతున్నారు.దీంతో వారి భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారుతుంది. బాలలను వీటి నుంచి విముక్తి కల్పించేందుకు ప్రభుత్వం ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమాన్ని చేపడుతోంది.ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన పిల్లలను గుర్తించి వారిని స్వస్థలాలకు పంపించి చదువుకునేలా చర్యలు తీసుకుంటుంది. ఈ కార్యక్రమాల కోసం జిల్లాలో రెండు ప్రత్యేక బృందాలను ఏర్పా టు చేశారు. ఆదిలాబాద్ పరిధిలో ఒకటి, ఉట్నూర్‌లో మరో బృందం పనిచేస్తుంది. ఈ బృందంలో నలుగురు కానిస్టేబుళ్లు, నలుగురు ఐసీపీఎస్ సి బ్బంది, కార్మిక శాఖాధికారులు ఉంటారు. వీరు ఆయా పరిధిలోని దుకాణ సముదాయాలు, హోట ళ్లు, ఇటుకబట్టీలు, రైల్వేస్టేషన్లలో తనిఖీలు నిర్వహిస్తూ తప్పిపోయి తిరుగుతున్న చిన్నారులను చెంతకు తీసుకుంటారు. సీడబ్ల్యూసీ ముందు హాజరుపర్చి వారి తల్లిదండ్రులకు అప్పగిస్తారు.

తీరు మారట్లే..!

కార్మికులు, యాచకులుగా జీవనం సాగిస్తున్న చిన్నారులు ఈ కార్యక్రమం తర్వాత మళ్లీ యథాస్థితికే వస్తున్నారు. ఇప్పటికీ ఐదేళ్లుగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నా పూర్తిస్థాయిలో ఫలితాలు కానరావడం లేదు. పనుల నుంచి విముక్తి చేసిన కొంతకాలం తర్వాత మళ్లీ అక్కడే ప్రత్యక్షమవుతున్నారు. తల్లిదండ్రుల ఆర్థిక పరిస్థితి ఒక కారణమైతే, కొంత మంది పిల్లలకు తల్లిదండ్రులు లేకపోవడంతో ఇలా మారుతున్నారు. ఇతర రాష్ట్రాలు, పక్క జిల్లాల నుంచి తప్పిపోయి వచ్చి ఎక్కడో ఒక చోట యాచకులుగా మారి జీవనం సాగిస్తున్నారు. అయితే నెలల తరబడి పనులు చేస్తున్న చిన్నారులను పట్టించుకోని ఆయా శాఖల అధికారులు ఈ కార్యక్రమాలు నిర్వహించే నెలల్లోనే వారిపై దృష్టి సారించడంపై పలువురు అసహనం వ్యక్తం చేస్తున్నారు. నిరంతరం పర్యవేక్షించాల్సిన కార్మిక శాఖ, ఐసీపీఎస్, విద్యాశాఖాధికారులు నామమాత్రంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలున్నాయి. ఈ కార్యక్రమాన్ని నిరంతరం చేపడితే అనుకున్న లక్ష్యాన్ని సాధించవచ్చని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

మైనర్లను పనిలో పెట్టుకుంటే కేసులు

మైనర్లను దుకాణాలు, కార్ఖానాల్లో పనుల్లో పెట్టుకుంటే చైల్డ్ యాక్ట్ ప్రకారం కేసులు నమోదు చేస్తాం. ఎవరైనా దృష్టికి వస్తే సమాచారం అందించాలి. ఆపరేషన్ ముస్కాన్ ద్వారా తప్పిపోయిన, బంధీ అయిన చిన్నారులను గుర్తించి వారి తల్లిదండ్రుల చెంతకు చేర్చుతున్నాం. జిల్లా వ్యాప్తంగా రెండు ప్రత్యేక బృందాలతో తనిఖీలు చేపట్టి అందరి సహకారంతో విజయవంతం చేస్తాం. ఈనెల 31 వరకు ఈ కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేస్తాం. – ఎల్.జీవన్‌రెడ్డి, డీఎస్పీ, ఆదిలాబాద్

'బదిలీ' వెబ్ ఆప్షన్ల ప్రక్రియ పూర్తి

ఆదిలాబాద్‌టౌన్: ఉపాధ్యాయుల బదిలీల ప్రక్రియలో భాగంగా ఎస్జీటీ, తత్సమాన ఉపాధ్యాయులు ఆన్‌లైన్‌లో వెబ్ ఆప్షన్లు పెట్టుకున్నారు. శనివారం రాత్రి నుంచి ఆదివారం రాత్రి వరకు ఈ ప్రక్రియ కొనసాగింది. సాంకేతిక కారణాలతో కొంత మంది ఇబ్బందులకు గురయ్యారు. ఎనిమిదేళ్ల సర్వీసు పూర్తి చేసిన ఉపాధ్యాయులు తప్పనిసరిగా బదిలీ కానుండగా, ఒక పాఠశాలలో రెండేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న వారు సైతం వెబ్ ఆప్షన్ ఇచ్చుకున్నారు. జిల్లాలో 998 మంది ఎస్జీటీలు బదిలీల కోసం దరఖాస్తు చేసుకున్న విషయం తెలిసిందే. ఇందులో ఎనిమిదేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న వారు 617 మంది ఉన్నారు. వీరందరికి తప్పనిసరి బదిలీ కానుంది. వీరితో పాటు 200 మంది ఉపాధ్యాయులకు స్థానచలనం జరిగే అవకాశాలున్నట్లు విద్యాశాఖ వర్గాలు చెబుతున్నాయి. బదిలీ ఉత్తర్వులు మరో రెండు మూడు రోజుల్లో జారీ అయ్యే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది.

29 శాఖలు.. 44 లక్షల మొక్కలు

- జిల్లాలో వన మహోత్సవం ప్రణాళిక ఖరారు
- నేడు మంత్రి సీతక్క చేతుల మీదుగా శ్రీకారం
- పచ్చదనం పెంపే లక్ష్యంగా యంత్రాంగం దృష్టి
- వర్షాలకు అనుగుణంగా మొక్కలు నాటేలా కార్యాచరణ



తాంసిలోని నర్సరీలో సిద్ధంగా ఉన్న మొక్కలు

కైలాస్‌నగర్: అటవీ విస్తీర్ణంతో పాటు పచ్చదనం పెంపొందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఏటా మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపడుతోంది. ఇందులో భాగంగా ఈ ఏడాది కూడా పెద్ద ఎత్తున మొక్కలు నాటాలని సంకల్పించింది. జిల్లాలో ఈ సీజన్‌లో 44లక్షల మొక్కలు నాటేలా ప్రణాళికను సిద్ధం చేసిన యంత్రాంగం 29 ప్రభుత్వ శాఖలను భాగస్వాములను చేసేలా వాటికి లక్ష్యాలను నిర్దేశించింది. అయితే గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం తెలంగాణకు హరితహారం పేరిట తొమ్మిది విడతలుగా మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టగా కాంగ్రెస్ ప్రభుత్వం తాజాగా వనమహోత్సవం పేరిట మొక్కలు నాటనుంది. జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క చేతుల మీదుగా సోమవారం జిల్లాలో శ్రీకారం చుట్టనున్నారు. వర్షాలు కురిసే కొద్ది ఆయా శాఖల ఆధ్వర్యంలో మొక్కలు నాటేందుకు సన్నద్ధమవుతున్నారు.

వన మహోత్సవంగా పేరు మార్పు

ఆదిలాబాద్ అడవుల జిల్లాగా పేరుగాంచినా చెట్లను ఇష్టానుసారంగా నరికివేయడంతో వృక్షసంపద కనుమరుగవుతోంది. ఈ క్రమంలో గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం తొమ్మిదేళ్లుగా తెలంగాణకు హరితహారం పేరిట పెద్ద ఎత్తున మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టింది. అడవులతో పాటు రైతుల చేల గట్లపైన, ఇంటి ఆవరణలో, రహదారుల వెంబడి, ప్రభుత్వ స్థలాల్లో వీటిని నాటించింది. తద్వారా పచ్చదనం కొంత పెరిగినా చాలా చోట్ల నాటిన మొక్కలు కనిపించకపోవడం గమనార్హం. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం కూడా మొక్కలు నాటే కార్యక్రమాన్ని కొనసాగిస్తోంది. అయితే వన మహోత్సవంగా పేరు మార్చింది. కార్యక్రమాన్ని రాష్ట్రస్థాయిలో సీఎం రేవంత్‌రెడ్డి శనివారం వరంగల్‌లో ప్రారంభించగా జిల్లాలో రాష్ట్ర మంత్రి సీతక్క చేతుల మీదుగా నేడు శ్రీకారం చుడుతున్నారు. జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి మావల అర్బన్ పార్కులో మొక్కలు నాటి కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు.

29 శాఖల భాగస్వామ్యం

ఇందులో భాగంగా జిల్లా వ్యాప్తంగా 44లక్షల మొక్కలు నాటాలని నిర్ణయించారు. 468 గ్రామ పంచాయతీలతో పాటు ఏకైక ఆదిలాబాద్ మున్సిపల్ పరిధిలో చేపట్టనున్న ఈ కార్యక్రమంలో 29 శాఖలను భాగస్వాములను చేశారు. ఆయా శాఖలు నాటాల్సిన మొక్కల లక్ష్యాలను నిర్దేశించారు. జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ ద్వారా అత్యధికంగా 25లక్షలు, అటవీ శాఖ ద్వారా 8లక్షలు, మున్సిపల్ ఆధ్వర్యంలో 5 లక్షలు, వ్యవసాయ శాఖ ద్వారా 2లక్షల మొక్కలు నాటేలా లక్ష్యాలను నిర్దేశించారు. మిగతా శాఖలకు స్థలాలు, అవసరాలకనుగుణంగా మొక్కలను కేటాయించారు. ప్రతి పంచాయతీలో ఉపాధి హామీ నిధులతో నర్సరీలను కూడా ఏర్పాటు చేశారు. వాటిలో గుల్‌మోర్, వేప, కానుగ, బూరుగు, చింత మొక్కలతో పాటు పండ్లకు సంబంధించి దానిమ్మ, మామిడి, నిమ్మ మొక్కలు, పూలకు సంబంధించి మందార, గులాబి, మల్లె వంటి వాటిని పెంచారు. ప్రస్తుతం నాటేందుకు సిద్ధంగా ఉన్నాయి.

గతేడాదితో పోల్చితే లక్ష తగ్గింపు

గతేడాదితో పోల్చితే ఈ సారి లక్ష మొక్కలను తగ్గించారు. ఇందులో ఐటీడీఏకు 50వేలు, ఉద్యానవనశాఖకు ఏడు వేలు, ఎక్సైజ్‌శాఖకు 5వేలు, ఇరిగేషన్‌శాఖ పది వేలు, ఎస్సీ కార్పొరేషన్ పదివేలు, సివిల్ స ప్లై 2వేలు, యువజన సర్వీసులు వెయ్యి, వైద్య ఆ రోగ్యశాఖ 2వేలు, దేవాదాయ శాఖ 3వేలు, మైనార్టీ వెల్ఫేర్ 2వేలు, ఆర్‌డబ్ల్యూఎస్ 2వేలు, ఎస్సీ వెల్ఫేర్ 4వేలు, పశు సంవర్ధక శాఖ, ఆర్టీసీ వెయ్యి చొప్పున నాటాల్సిన మొక్కలను తగ్గించారు.

జిల్లాలో ఈ ఏడాది నాటాల్సిన మొక్కల లక్ష్యం శాఖల వారీగా..

ప్రభుత్వ శాఖ	మొక్కల లక్ష్యం
డీఆర్డీవో	25లక్షలు
అటవీ	8లక్షలు
మున్సిపల్	5 లక్షలు
వ్యవసాయ	2 లక్షలు
విద్య	1లక్ష
పోలీసు	1లక్ష
ఎస్సీ కార్పొరేషన్	40వేలు
ఐటీడీఏ	50వేలు
ఇరిగేషన్	20వేలు
ఉద్యానవన శాఖ	18వేలు
ఆర్అండ్‌బీ	15వేలు
వైద్యారోగ్య	8వేలు
ఎస్సీ వెల్ఫేర్	6వేలు
దేవాదాయ	6వేలు
పరిశ్రమలు	5వేలు
ఎక్సైజ్	5వేలు
విద్యుత్	5వేలు
ఇంటర్మీడియెట్	3వేలు
ఆర్టీసీ	2వేలు
రెవెన్యూ	3వేలు
ఆర్‌డబ్ల్యూఎస్	3వేలు
మైనార్టీ సంక్షేమం	3వేలు
సివిల్ సప్లై	3వేలు
మత్స్య	2,500
పశుసంవర్ధక	2వేలు
మార్కెటింగ్	2వేలు
డిగ్రీ కళాశాలలు	1,500
యువజన,క్రీడలు	1,000

మా గోడు.. పట్టించుకోరు!

- అదనపు పని గంటలతో అవస్థలు
- ఆదాయం లక్ష్యంగా అధికారుల ఒత్తిడి
- సంఘాలు లేవు.. సమస్యలు పట్టించుకోరు
- పెరిగిన పనిభారంపై ఆర్టీసీ కార్మికుల ఆవేదన



ఆదిలాబాద్ బస్టాండ్‌లో ప్రయాణికుల రద్దీ (ఫైల్)



ఇందూర్‌పల్లి వద్ద అదుపు తప్పిన బస్సు (ఫైల్)

'మహాలక్ష్మి పథకం స్టార్ట్ అయినప్పటి నుంచీ పనిభారం బాగా పెరిగింది.. దాదాపు మూడు నుంచి నాలుగు గంటలు అదనంగా పని చేయాల్సి వస్తుంది.. అయినా కూడా డబుల్ డ్యూటీలు చేయమని అధికారులు వేధిస్తున్నారు.. సెలవులు అడిగినా సరిగా ఇవ్వట్లేదు. మహిళా కార్మికులను సైతం లక్ష్యంగా చేసుకొని అదనంగా పనిచేసేలా ఒత్తిడి చేస్తున్నారు.. యూనియన్ నాయకులను టార్గెట్ చేస్తున్నారు.. మా సమస్యలు యాజమాన్యం దృష్టికి తీసుకెళ్దామంటే సంఘాలు కూడా లేవు.. ఇదే అదనుగా క్షేత్రస్థాయిలో అధికారులు చిన్నచిన్న కారణాలు చూపి సస్పెన్షన్ వేటు వేస్తున్నారు.. ఎవరికి చెప్పుకోవాలో అర్థం కావడం లేదు..' ఇది జిల్లా కేంద్రంలోని ఓ ఆర్టీసీ కార్మికుడి ఆవేదన.

ఆదిలాబాద్: ప్రయాణికులను సురక్షితంగా తమ గమ్యస్థానాలకు చేర్చే ఆర్టీసీ కార్మికులకు ఇబ్బందులు తప్పడం లేదు. విధి నిర్వహణలో భాగంగా పని ఒత్తిడి ఎదుర్కోవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మహాలక్ష్మి పథకం అమలు నుంచి డ్యూటీ సమయానికి మించి పని చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని అంటున్నారు.

కార్మికులపై 'మహాలక్ష్మి' భారం

రాష్ట్ర ప్రభుత్వం ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తూ మహాలక్ష్మి పథకాన్ని ప్రవేశపెట్టింది. దీంతో ఆక్యుపెన్సీ రేషియో (ఓఆర్) ఒక్కసారిగా పెరిగిపోయింది. ఈ ప్రభావం కండక్టర్లు, డ్రైవర్లపై చూపుతోంది. ప్రయాణికులు పరిమితికి మించి ప్రయాణిస్తుండడంతో గమ్యస్థానానికి చేరుకోవడానికి అధిక సమయం పడుతోంది. అలాగే కిక్కిరిసిన బస్సుల్లో కండక్టర్లకు టికెట్ జారీ సైతం సమస్యాత్మకంగా మారుతుంది. పొరుగున ఉన్న మహారాష్ట్రకు వెళ్లే సర్వీసుల్లో సరిహద్దు వరకు మాత్రమే మహిళలకు ఉచిత పథకం అమలులో ఉంటుంది. బార్డర్ తర్వాత టికెట్ ఇష్యూ చేయాలి. ఈ క్రమంలో పలుమార్లు కండక్టర్లు తడబాటుకు గురై, అధికారుల మందలింపులకు గురవుతున్నారు.

ఉన్నతాధికారుల వేధింపులు..

పని ఒత్తిడితో ఇబ్బందులు పడుతున్న కార్మికులకు ఉన్నతాధికారుల వేధింపులు తోడవుతున్నాయి. బస్సు రూటు, ప్రయాణికుల సంఖ్య, ఓఆర్, పండుగలు, సాధారణ పనిదినాలు వంటి విషయాలేవీ పరిగణలోనికి తీసుకోకుండా సంబంధిత రూట్లలో నిర్దేశించిన ఆదాయం సాధించాలని కండక్టర్లు, డ్రైవర్లపై ఒత్తిడి తీసుకువస్తున్నారు. కేఎంపీఎల్ రాకపోతే సంబంధిత ఉద్యోగులను కౌన్సెలింగ్ పేరిట మందలింపులకు గురి చేస్తున్నారు. ఆదాయం సాధించని వారి పేర్లను డిపో పరిధిలో ప్రత్యేక బోర్డు ఏర్పాటు చేసి ప్రదర్శిస్తుండడం గమనార్హం.

పని ఒత్తిడితో ప్రమాదాలు..

డ్రైవర్లు నిర్దేశించిన సమయంకు మించి అదనంగా విధులు నిర్వర్తించాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. పలు సందర్భాల్లో 10 నుంచి 12 గంటల వరకు డ్యూటీ చేయాల్సి వస్తుంది. ఈ క్రమంలోనే వారిపై ఒత్తిడి పెరిగి ప్ర మాదాలు చోటు చేసుకుంటున్నట్లు తెలుస్తోంది. ఈ ఏడాది ఫిబ్రవరి 6న తలమడుగు మండలం చర్లపల్లి వద్ద ఆర్టీసీ బస్సు బోల్తాపడిన ఘటనలో డ్రైవర్‌తో పాటు పలువురు ప్రయాణికులకు గాయాలయ్యాయి. అలాగే జూన్ 3న భీంపూర్ మండలంలోని అర్లి-ఇందూర్‌పల్లి మార్గంలో బస్సు అదుపు తప్పినా తృటిలో పెను ప్రమాదం తప్పింది. పెరుగుతున్న పనిగంటల కారణంగానే ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని కార్మికులు పేర్కొంటున్నారు.

భారం పడకుండా చర్యలు

మహాలక్ష్మి పథకంతో ప్రయాణికుల సంఖ్య పెరిగిన మాట వాస్తవమే. అయితే కార్మికులపై భారం పడకుండా చర్యలు తీసుకుంటున్నాం. ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించేలా ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలి. కార్మికులు ఒత్తిడికి గురి కాకుండా విధులు నిర్వహించేలా ప్రత్యేక శిక్షణ, హెల్త్ ఛాలెంజ్ కార్యక్రమాలను చేపడుతున్నాం. వారి సంక్షేమంపై దృష్టి సారిస్తున్నాం. ప్రయాణికులు సైతం ఆర్టీసీ కార్మికులకు సహకరించాలి.
– సాలోమన్, ఆర్టీసీ ఆర్ఎం

నత్తనడకన భగీరథ సర్వే

- గడువు దాటినా పూర్తికాని వైనం
- తొమ్మిది మండలాల్లో వెరీ స్లో..
- లక్ష్యానికి చేరువలో భీంపూర్



సిరికొండలో చేపట్టిన సర్వేను ఇటీవల పరిశీలిస్తున్న డీఎల్‌పీవో ఫణిందర్‌రావు

కైలాస్‌నగర్: గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు మిషన్ భగీరథ నీరు అందుతుందా.. లేదా అని తెలుసుకోవడంతో పాటు ప్రతి ఇంటిలో నల్లా కనెక్షన్లు ఉన్నాయా.. లేవా అనే వివరాలు గుర్తించేందుకు చేపట్టిన మిషన్ భగీరథ ఇంటింటి సర్వే జిల్లాలో నత్తనడకన సాగుతోంది. గత నెల 10న ప్రారంభించిన ఈ సర్వేను పది రోజుల్లోగా పూర్తి చేయాలని ఉన్నతాధికారులు నిర్ణయించారు. అయితే నిర్ణీత గడువుతో పాటు జూన్ నెల సైతం ముగిసినప్పటికీ సర్వే పూర్తికాకపోవడం క్షేత్రస్థాయిలోని సిబ్బంది పనితీరుకు అద్దం పడుతోంది.

గడువు ముగిసినా..

జిల్లాలో 1200 హ్యాబిటేషన్లు ఉండగా వాటి పరిధిలో 1,45,502 నివాస గృహాలు ఉన్నాయి. వీటిలో నల్లా కనెక్షన్లు ఉన్నాయా.. ఉంటే మిషన్ భగీరథ నీటి సరఫరా అవుతుందా.. తదితర వివరాలను ప్రత్యక్షంగా తెలుసుకునేందుకు ప్రభుత్వం ఇంటింటి సర్వేకు ఆదేశించింది. ఇందుకోసం జిల్లాలో పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ టీఏలు, ఫీల్డ్ అసిస్టెంట్లు, ఏపీఎంలు, ఐకేపీ సీసీలు కలిపి మొత్తం 876 మందిని నియమించారు. సర్వే నిర్వహణతో పాటు వివరాలను ప్రత్యేక యాప్‌లో ఏవిధంగా నమోదు చేయాలనే దానిపై వారికి ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. గత నెల 10న క్షేత్రస్థాయి సర్వేను ప్రారంభించారు. పది రోజుల్లోగా పూర్తి చేయాలని సంకల్పించారు. అయితే ఇప్పటి వరకు 1,28,655 నివాస గృహాలను సర్వే చేశారు. ఇంకా 16,847 నివాస గృహాలు సర్వే చేయాల్సి ఉంది. పలు మండలాల్లో ఈ ప్రక్రియ నత్తనడకన సాగుతున్నట్లు తెలుస్తోంది.

తొమ్మిది మండలాల్లో వెనుకబాటు

సర్వేలో భాగంగా గ్రామాల్లో ఇంటింటికి వెళుతున్న సిబ్బంది ఇంటి యజమాని పేరు, ఆధార్, మొబైల్ నంబర్, కుటుంబ సభ్యుల వివరాలు సేకరిస్తున్నారు. యజమాని ఫొటోతో పాటు ఇంట్లో నల్లా ఉంటే దానిని కూడా ఫొటో తీసి యాప్‌లో నమోదు చేస్తున్నారు. నల్లా ద్వారా నీరు వస్తే సరఫరా అవుతుందని, రాకుంటే రావడం లేదనే వివరాలు పొందుపరుస్తున్నారు. జిల్లాలోని బేల, ఆదిలాబాద్ రూరల్, నార్నూర్, తలమడుగు, ఇచ్చోడ, బజార్‌హత్నూర్, జైనథ్, ఇంద్రవెల్లి, నేరడిగొండ వంటి తొమ్మిది మండలాలు సర్వేలో వెనుకబడ్డాయి. మిగతా చోట్ల కొంత నయంగా తెలుస్తోంది. భీంపూర్ మండలం దాదాపు పూర్తి కావచ్చింది. ఈ మండలంలో ఇంకా సర్వే చేయాల్సిన గృహాలు కేవలం 21 మాత్రమే ఉన్నాయి.

మండలం	కుటుంబాలు	సర్వే చేసిన ఇళ్లు	మిగిలినవి
బేల	10616	8977	1639
ఉట్నూర్	16275	15973	302
ఇంద్రవెల్లి	9260	8355	905
సిరికొండ	4370	3796	574
ఆదిలాబాద్‌రూరల్	9702	7878	1824
నేరడిగొండ	7325	6380	945
నార్నూర్	7648	6329	1319
తలమడుగు	8807	7791	1016
గాదిగూడ	5341	4879	462
ఇచ్చోడ	10135	8534	1601
మావల	1483	1068	415
జైనథ్	14165	12998	1167
బజార్‌హత్నూర్	7671	6535	1136
తాంసి	4650	4036	614
గుడిహత్నూర్	7604	6558	1046
భీంపూర్	5909	5888	21
బోథ్	14541	12998	1543

మరో ఐదు రోజుల్లో పూర్తి చేస్తాం

జిల్లాలోని 374 హ్యాబిటేషన్లలో ఎలాంటి నెట్‌వర్క్ లేదు. ఇలాంటి గ్రామాల్లో ప్రత్యేక యాప్ ద్వారా సర్వే నిర్వహించడం ఇబ్బందికరంగా మారింది. మొన్నటి వరకు సర్వే వివరాలు ఆఫ్‌లైన్‌లో నమోదు చేసే అవకాశం లేదు. దీంతోనే జాప్యం అయింది. ప్రస్తుతం నెట్‌వర్క్‌లేని గ్రామాల్లోని సర్వే వివరాలను ఆఫ్‌లైన్‌లో నమోదుకు ఉన్నతాధికారులు అవకాశం కల్పించారు. ఇక వేగవంతం చేస్తాం. మరో ఐదు రోజుల్లో వందశాతం పూర్తయ్యేలా దృష్టి సారిస్తాం.
– ఫణిందర్‌రావు, డివిజనల్ పంచాయతీ అధికారి, ఆదిలాబాద్

క్లుప్తంగా

జిల్లా ఆర్టిస్ట్‌కు అవార్డు

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని కేఆర్‌కే కాలనీకి చెందిన ఆర్టిస్ట్ ద్యావంత్ రమేశ్ ఆదివారం మణికంఠ ఆర్ట్స్ గ్యాలెరీ నుంచి అవార్డు అందుకున్నారు. ఆయన ఇటీవల నేషనల్ ఆన్‌లైన్ ఆర్ట్స్ ఎగ్జిబిషన్ కాంపిటీషన్‌లో పాల్గొనగా 12వ రైజింగ్ స్టార్ అవార్డు వచ్చినట్లు పేర్కొన్నారు. చిత్రలేఖనం ద్వారా వేసిన మూడు చిత్రాలను ఎంపిక చేశారు.

‘ఖేలో భారత్’లో ఖానాపూర్ వాసి ప్రతిభ


అవార్డు అందుకుంటున్న సురేందర్

ఖానాపూర్: మండలంలోని చందునాయక్ తండాకు చెందిన గుగ్లావత్ కళాబా యి–బలిరాం దంపతుల కుమారుడు సురేందర్ ఖేలో భారత్ పోటీల్లో ఫిస్టల్ అండ్ రైఫిల్ షూటింగ్‌లో గోల్డ్ మెడల్ సాధించాడు. భారత్ యూత్ గేమ్స్ ఇంటర్నేషనల్ ఛాంపియన్‌షిప్–2024 పోటీలు నేపాల్‌లోని (ఫోఖరా) రంగశాల స్టేడియంలో ఈ నెల 27, 28, 29 తేదీల్లో నిర్వహించారు. 10 మీటర్ల ఫిస్టల్ అండ్ రైఫిల్ షూటింగ్‌లో వ్యక్తిగత విభాగంలో గోల్డ్ మెడల్‌తో పాటు టీంతో మరో బంగారు పతకం సాధించాడు.

‘ట్రిపుల్’ ట్రబుల్స్ ఎవరికీ పట్టవా?

- విద్యార్థుల ఇబ్బందులు పట్టించుకోరు
- వారికి మాట్లాడే అవకాశం కూడా లేదు..
- క్యాంపస్‌పై ప్రభుత్వం దృష్టి పెట్టదు..
- వర్సిటీలో అంతా రహస్యమేనా?


బాసర ట్రిపుల్ ఐటీ

భైంసా: బాసర ట్రిపుల్‌ఐటీ అంటే రాష్ట్ర వ్యాప్తంగా అందరికీ తెలిసిందే... కానీ ఇక్కడ చదివే విద్యార్థుల సమస్యలు మాత్రం ఎవరికీ తెలియవు. ఏం జరిగినా గుట్టుగా ఉంచడం రహస్య క్యాంపస్‌గా మార్చడమే ఉన్నతాధికారుల లక్ష్యంగా కనిపిస్తోంది. చదువుకునే పిల్లలకు జైలు వాతావరణం తలపించే పరిస్థితులు కనిపిస్తున్నా ఏ ఒక్కరూ నోరు మెదపడం లేదు. తమ సమస్యలను పరిష్కరించుకునేందుకు ఓ కమిటీ వేసుకుందామన్నా అనుమతించడం లేదు. కమిటీ కోసం దరఖాస్తు చేసుకుంటే ఏదో ఒక వంక చూపి విద్యార్థులను ఇబ్బందులు పెట్టడమే కాకుండా వారికి కమిటీ వేసుకునే పరిస్థితులను మరింత క్లిష్టం చేస్తున్నారు. విద్యార్థుల ఆందోళనలు, నిరసనలు ఇలా ఏదో ఒక విషయంలో ట్రిపుల్‌ఐటీ ఎప్పుడూ వార్తల్లో కనిపిస్తున్నా శాశ్వత పరిష్కారం మాత్రం ఎవరూ చూపడం లేదు. ప్రారంభం నుంచి ఇప్పటి వరకు ఎంతో మంది విద్యార్థులు ఆత్మహత్యలకు సైతం పాల్పడ్డారు. బాసర ట్రిపుల్‌ఐటీ రహస్య క్యాంపస్‌గా మారింది. అక్కడ ఏం జరిగినా బయటకు తెలియకుండా జాగ్రత్త పడుతున్నారు. మీడియా, విద్యార్థి సంఘాలు, తల్లిదండ్రులు, మేధావులు ఎవరైనా సరే లోపలికి మాత్రం అనుమతించరు.

ఆందోళనకు సిద్ధమవుతున్న విద్యార్థులు..

మరోవైపు తమ సమస్యల పరిష్కారం కోసం ఇక్కడ చదివే విద్యార్థులంతా ఆందోళనకు సిద్ధమవుతున్నారు. రెండేళ్ల క్రితం చేపట్టిన ఉద్యమంలాగే ఇప్పుడు కూడా ఆందోళనలు చేపట్టాలని నిర్ణయించారు. గతంలో కొంతమంది విద్యార్థులే టార్గెట్‌గా చేసి కేసులు పెట్టారు. ఇప్పుడు విద్యార్థులంతా ఐక్యంగా వెళ్లి తమ సమస్యలు వినిపించి కమిటీ వేసి పోరాడాలని ఆలోచిస్తున్నారు. క్యాంపస్ అధికారులు కమిటీకి అనుమతించాలని కోరుతున్నారు. నిబంధనల పేరిట కాలయాపన చేస్తే విద్యార్థులంతా ఐక్యంగా నిరసనలకు దిగాలని నిర్ణయించారు. తమ సమస్యలను వినకుంటే నిరవధిక ఆందోళనలు చేపట్టాలని నిర్ణయించారు. ఏళ్ల తరబడి సమస్యలతో సహవాసం చేస్తున్న తమ ఇబ్బందులు తీర్చే మార్గం చూపాలని కోరుతున్నారు. ముదోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ జనవరిలో అసెంబ్లీలోనూ ట్రిపుల్ ఐటీ ప్రక్షాళన చేపట్టాలని కోరారు. ప్రభుత్వం ఇప్పటికైనా దృష్టి పెట్టి ట్రిపుల్ ఐటీ సమస్యలు పరిష్కరించాలని విద్యార్థులు కోరుతున్నారు.

భరోసా లేక...

తమ బిడ్డల భవిష్యత్‌కు భరోసాగా ఉంటుందనుకునే ప్రతిష్టాత్మక బాసర ట్రిపుల్‌ఐటీలో ఇటీవలి కాలంలో వరుసగా విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. తాజాగా మరో విద్యార్థి తన నిండు ప్రాణాన్ని బలి తీసుకున్నాడు. వేలాది మంది ఉండే ఈ క్యాంపస్‌లో చదివే విద్యార్థులకు మనోధైర్యం ఇచ్చే వాళ్ళు లేకపోవడమే ఇందుకు కారణంగా భావిస్తున్నారు. రోజూ చదివే విద్యార్థులపై యూనివర్సిటీ అధికారులు దృష్టి పెట్టలేకపోతున్నారు. 9వేల మంది విద్యార్థులు ఉండే ట్రిపుల్‌ఐటీ క్యాంపస్‌లో తరగతి గదుల్లో నీరసంగా, అసహనంగా, ఒంటరిగా ఉండే వారిని పిలిచి కౌన్సిలింగ్ ఇచ్చి మనోధైర్యాన్ని కల్పిస్తే ఆత్మహత్యలు కాస్తయినా ఆగుతాయి. విద్యార్థులు ఒత్తిడిలో చదువుతారు. చదువు పూర్తవుతున్న సమయంలోనూ ప్లేస్‌మెంట్, కుటుంబ పరిస్థితులు ఇతర వ్యసనాలు వారిలో పదేపదే మానసిక ఒత్తిడిని పెంచుతుంటాయి. ఈ ఒత్తిడిని తగ్గించేలా క్యాంపస్‌లో క్రీడలు, సంగీతంపై మక్కువపెంచేలా చూడాలి. వారానికి ఒక్కరోజైనా విద్యార్థులు ఆహ్లాదకరమైన వాతావరణం మధ్య అన్నింటినీ మరిచి మానసిక ప్రశాంతతను పొందేలా వారిని ప్రేరేపించాలి. ఇష్టమైన రంగంలో ఆటలు ఆడుకునేవీలు కల్పించాలి. ఎంతోమంది విద్యార్థులు ఉన్న ఈ క్యాంపస్‌లో అప్పుడప్పుడు వినోదాన్ని పంచే కార్యక్రమాలు నిర్వహించాలి. విద్యార్థులంతా ఒంటరిగా ఉండకుండా ఎవరితోనైనా తమ బాధలు చెప్పుకునేలా మనసు విప్పి మాట్లాడుకునేలా పరిస్థితులు కల్పించాలి. భయం మధ్య, ఏంజరుగుతుందోనన్న క్షణాల మధ్య తరగతి గదుల్లో, వసతి గృహాల్లో ఉండే విద్యార్థులు ఇలా ఆత్మహత్యలు చేసుకుంటున్నారు.

తీరికలేక...

విద్యార్థులు ప్రతీరోజు ఆటలు ఆడుకునేలా షెడ్యూల్ ఉంచాలి. ఉదయం నిద్రలేచినప్పటి నుంచి రాత్రి పడుకునే వరకు స్నానాలు, భోజనాలు, తరగతి గదులు వీటితోనే రోజు పూర్తవుతుంది. రోజుకు అరగంటైనా విద్యార్థులంతా ఇష్టమైన క్రీడల్లో పాల్గొనేలా ఏ ఒక్కరూ చూడడంలేదు. క్రీడల్లో ఉన్న విద్యార్థులు మానసిక ఒత్తిడికి కాస్త దూరమవుతారు. వారంలో ఒక్కరోజైనా చెవులకు ఇంపైన సంగీతం, వినోద కార్యక్రమాలు తిలకించే ఏర్పాట్లు చేయాలి. కానీ అవేం ఇక్కడ జరగడం లేదు. విద్యార్థుల పరిస్థితిపై ఎప్పటికప్పుడు సైకాలజిస్టులతో కౌన్సిలింగ్‌లు ఇప్పిస్తూ మానసికస్థితిని తెలుసుకోవాలి. ఒంటరిగా ఉండే విద్యార్థులను గుర్తించి వారి తల్లిదండ్రులను పిలిచి గతంలో ఎలా ఉండేవారు? ఇప్పుడు ఎందుకిలా ప్రవర్తిస్తున్నాడు అనే విషయాలు చర్చించాలి. క్యాంపస్ అధికారులు మార్చలేకపోయిన ఒంటరితనాన్ని గుర్తించి కుటుంబ సభ్యులైనా వారికి మనోధైర్యం కల్పించి ఇలాంటి పరిస్థితులు తలెత్తకుండా జాగ్రత్తపడే అవకాశం ఉంటుంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి ట్రిపుల్‌ఐటీ విద్యార్థుల పరిస్థితులు తెలుసుకుని వారి మనసుకు అనుగుణంగా నడుచుకుని ఆత్మహత్యలకు అడ్డుకట్టవేయాలని పోషకులు కోరుతున్నారు.

సీఎం సార్ వస్తేనే...

నాటి ప్రభుత్వంలో బాసర ట్రిపుల్‌ఐటీలో ఆంక్షల పేరుతో ఎవరినీ అనుమతించలేదు. గతేడాది డిసెంబర్ 7న తెలంగాణ రాష్ట్ర సీఎంగా ప్రమాణం స్వీకారం చేసిన రేవంత్‌రెడ్డి ప్రగతిభవన్‌ను ప్రజాభవన్‌గా మార్చారు. ప్రగతిభవన్ ఎదుట ఉన్న ఇనుప కంచెను తొలగించారు. అక్కడే ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నారు. కానీ బాసర ట్రిపుల్‌ఐటీలో మాత్రం నేటికీ పాత ఆంక్షలే కొనసాగిస్తున్నారు. క్యాంపస్ చుట్టూ ఉన్న భారీ ప్రహరీ దాటి లోనికి ఎవరూ వెళ్లలేరు. పైగా తల్లిదండ్రులను కూడా అనుమతించడం లేదు. ఇంటి నుంచి వండుకొచ్చిన భోజనాలు విద్యార్థులకు పెడదామన్నా పంపించడం లేదు. క్యాంపస్‌కు ఇరువైపులా భారీ గేట్లు నిర్మించి ఎవరినీ అనుమతించడం లేదు. విద్యార్థులకు సమస్యలు చెప్పుకునే అవకాశం కూడా కల్పించడంలేదు. సీఎం రేవంత్‌రెడ్డి నేరుగా బాసర ట్రిపుల్‌ఐటీకి వచ్చి సమస్యలు తెలుసుకుని శాశ్వత పరిష్కారానికి మార్గం చూపుతారని ఇక్కడి విద్యార్థులు ఆశగా ఎదురుచూస్తున్నారు.

చిత్రం గీసి..అభిమానం చాటి..



తాంసి: మాజీ పార్లమెంట్ సభ్యుడు, బీజేపీ నాయకుడు రమేశ్ రాథోడ్ శనివారం అనారోగ్యంతో మృతి చెందాడు. మండలంలోని పొన్నారి గ్రామానికి చెందిన కళాకారుడు గట్టు రాజు పెన్సిల్‌తో మాజీ ఎంపీ బొమ్మను గీసి అస్తమించిన రమేశ్ రాథోడ్ అంటు నివాళి అర్పించాడు.

సీపీఐ రాష్ట్ర సమావేశాల్లో ఉమ్మడి జిల్లా నాయకులు


సమావేశంలో పాల్గొన్న నాయకులు

ఎదులాపురం: ఖమ్మం జిల్లా కేంద్రంలో జరుగుతున్న సీపీఐ రాష్ట్ర సమావేశాలకు ఉమ్మడి ఆదిలాబాద్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు కలవేన శంకర్, జిల్లా కార్యదర్శి ముడుపు ప్రభాకర్ రెడ్డి, నిర్మల్ జిల్లా కార్యదర్శి ఎస్.విలాస్, తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో పార్టీ బలోపేతానికి సంబంధించి పలు అంశాలను గురించి చర్చించడం జరిగిందని వెల్లడించారు.

ఎల్లమ్మ ఆలయంలో చోరీ

ఖానాపూర్: దిలావార్‌పూర్‌లోని రేణుకా ఎల్లమ్మ ఆలయంలో శనివారం రాత్రి చోరీ జరిగింది. ఆలయం గేటు తాళం పగులగొట్టి లోనికి వెళ్లిన దుండగులు అమ్మవారిపై ఉన్న 500 గ్రాముల వెండి కిరీటంతో పాటు 15 గ్రాముల బంగారు పుస్తెలు, ఒక గ్రాము బంగారు ముక్కు పుడక, హుండీలో ఉన్న నగదును సైతం ఎత్తుకెళ్లారు. ఆలయ కమిటీ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఏఎస్సై శ్రీనివాస్‌వర్మ తెలిపారు.

వైన్‌షాపు ఉద్యోగిని బెదిరించి నగదు కాజేత

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణంలోని టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో గల శ్రీనివాస వైన్‌షాపులో కౌంటర్ వద్ద పనిచేస్తున్న ఉద్యోగిని బెదిరించి నగదు కాజేసిన సంఘటన శనివారం రాత్రి చోటు చేసుకుంది. టూటౌన్ సీఐ అశోక్ తెలిపిన వివరాల ప్రకారం శనివారం రాత్రి శ్రీనివాస వైన్‌షాపులోకి వెళ్లిన అసీపొద్దీన్ ఖురైషీ బెదిరించి రూ.3వేల నగదు లాక్కుని అక్కడి నుంచి ఉడాయించాడు. దీంతో బాధితుడు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

ఇక సెలవు..

- ముగిసిన రాథోడ్ రమేశ్ అంత్యక్రియలు
- అంతిమ యాత్రలో కిక్కిరిసిన జనం..
- ముఖ్య నేతల నివాళులు


అంతిమయాత్రలో పాల్గొన్న నాయకులు, అభిమానులు

ఉట్నూర్‌రూరల్: బీజేపీ జాతీయ నాయకుడు, మాజీ ఎంపీ రాథోడ్ రమేశ్ అంత్యక్రియలను ఆదివారం ఉట్నూర్ ఎక్స్‌రోడ్డులో నిర్వహించారు. అంతకుముందు ఉదయం 11గంటలకు పాత ఉట్నూర్, పెర్కగూడ మీదుగా ఎక్స్‌రోడ్డు వరకు అంతిమయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదిలాబాద్ – మంచిర్యాల ప్రధాన రహదారులు జనాలతో కిక్కిరిసిపోయాయి. హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ రమేశ్ రాథోడ్ కుటుంబానికి సంతాపం తెలియజేశారు. శనివారం రాత్రి 2 గంటలకు కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్, ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ రాథోడ్ రమేశ్ స్వగృహానికి చేరుకొని పార్థివదేహం వద్ద నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడుతూ ఎంపీగా, జెడ్పీచైర్మన్‌గా, ఎమ్మెల్యేగా రాథోడ్ రమేశ్ చేసిన సేవలను కొనియాడారు. ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు, మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్, బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి, మాజీ ఎంపీ సోయం బాపురావు, మాజీ ఎమ్మెల్సీలు పురాణం సతీశ్, రాములు నాయక్, ఎమ్మెల్యేలు జాదవ్ అనీల్, రామారావు పటేల్, మాజీ మంత్రులు ఐకేరెడ్డి, జోగు రామన్న అంత్యక్రియల్లో పాల్గొన్నారు. పెద్ద ఎత్తున అభిమానులు తరలిరావడంతో ఉట్నూర్ డీఎస్పీ నాగేందర్ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. రమేశ్ రాథోడ్ కుటుంబాన్ని మంత్రి సీతక్క రాత్రి పరామర్శించారు.


అంత్యక్రియల్లో పాల్గొన్న ఐకేరెడ్డి, జోగు రామన్న, పురాణం సతీశ్, ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్


భౌతిక ఖాయం వద్ద నాయకుల నివాళులు

గుర్తు తెలియని వ్యక్తి మృతి


గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణంలోని బస్టాండ్‌లో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన శనివారం రాత్రి చోటు చేసుకుంది. గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతోనే మృతిచెంది ఉండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. మృతుని వయస్సు 55 సంవత్సరాల వరకు ఉంటుందని, మృతదేహాన్ని రిమ్స్ మార్చురిలో భద్రపర్చినట్లు పేర్కొన్నారు. ఎవరైనా గుర్తుపడితే 8712659920 నంబరులో సమాచారం అందించాలని సీఐ అశోక్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి దుర్మరణం

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని బెల్లూరి శివారులో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వండాల బాలకృష్ణ (36) దుర్మరణం చెందినట్లు ఎస్సై ముజాహిద్ తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన బాలకృష్ణ గతేడాది నుంచి భార్యతో కలిసి మహారాష్ట్రలో నివాసం ఉంటున్నాడు. ఇదే క్రమంలో శనివారం ఆదిలాబాద్‌రూరల్ మండలంలోని చాందాలో ఆయన బంధువుల ఇంటికి వచ్చాడు. ఆదివారం ఉదయం ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా బెల్లూరిలోని అయ్యప్ప ఆలయ సమీపంలో గల సైన్‌బోర్డుకు ఢీకొట్టాడు. దీంతో తీవ్ర గాయాలపాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై వివరించారు.

ఉరేసుకుని ఒకరు ఆత్మహత్య

లోకేశ్వరం: ఉరేసుకుని ఒకరు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఏఎస్సై దిగంబర్ తెలిపిన వివరాల మేరకు మండలంలోని సేవాలాల్‌తండాకు చెందిన పవార్ కృష్ణ (28) కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. ఆదివారం ఇంట్లో ఎవరూలేని సమయంలో దూలానికి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుని భార్య అశ్విని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఏఎస్సై తెలిపారు.

రెండు లారీలు ఢీ


రహదారిపై నిలిచిన వాహనాలు

నేరడిగొండ: మండల కేంద్రంలోని సూర్యగార్డెన్ సమీపంలో ఆదివారం ఆదిలాబాద్ నుంచి నిర్మల్ వైపు ఓవర్ లోడ్‌తో వెళ్తున్న లారీ రోడ్డుపైన పార్కింగ్ చేసిన మరో వాహనాన్ని దాటే క్రమంలో మరోలారీ వెనుకనుంచి ఢీకొట్టింది. దీంతో ఆ దారిగుండా వెళ్లే వాహనాల రాకపోకలకు గంటపాటు అంతరాయం ఏర్పడింది.

ముగ్గురు గుట్కా విక్రేతలపై కేసు

ఆదిలాబాద్‌టౌన్: అక్రమంగా గుట్కా తరలిస్తున్న ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు టూటౌన్ సీఐ అశోక్ తెలిపారు. ఖుర్షీద్‌నగర్‌కు చెందిన షేక్ సమీ, ఇమ్రాన్ ఖాన్, షేక్ మోసిన్ శనివారం రాత్రి అ స్లాం ట్రేడర్స్ నుంచి గుట్కా కొనుగోలు చేసి తరలిస్తుండగా పట్టుకున్నట్లు ఆయన తెలిపారు. పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా అనుమానం వచ్చి వారిని తనిఖీ చేయగా రూ.2,300 విలువ గల గుట్కా ప్యాకెట్లు లభించినట్లు వివరించారు. నిందితులపై కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

రెండు ఇసుక టిప్పర్ల పట్టివేత

బేల: కాంఘర్‌పూర్ శివారులోని పెన్‌గంగ నుంచి ఆదివారం ఇసుక తరలిస్తున్న రెండు టిప్పర్లను పట్టుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు ఎస్సై రాధిక తెలిపారు. ఇసుకతో నిండిన టిప్పర్‌పై జిల్లా మైనింగ్ శాఖకు, ఖాళీ టిప్పర్‌పై తహసీల్దార్‌కు నివేదించినట్లు ఎస్సై పేర్కొన్నారు.